అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశానికి 12న కౌన్సెలింగ్

మధిర, ఆగస్టు 9: అగ్రికల్చర్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 12న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు మధిర అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కే.రుక్మిణిదేవి తెలిపారు. మధిరలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, ఆర్గానిక్ అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ వంటి డిప్లొమా కోర్సులకు యూనివర్సిటీ ఎగ్జామినేషన్ సెంటర్లో కౌన్సెలింగ్ జరుగుతుందని చెప్పారు. టీఎస్ పాలిసెట్‌లో అర్హత సాధించిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆటోల చోరీ నిందితుడి అరెస్టు

మామిళ్లగూడెం, ఆగస్టు 9: ఆటోలను దొంగతనం చేస్తున్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం సమయంలో పాత బస్టాండ్ వెనుక వైపు ఎంట్రీ గేటు వద్ద అప్పీ ఆటో టీఎస్ 04 యూఏ 1871తో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా ఖమ్మంరూరల్ మండలం, గుదిమళ్ల గ్రామానికి చెందిన గోసు వెంకన్నగా గుర్తించినట్లు తెలిపారు. మద్యానికి, చెడు వ్యసనాలకు బానిసైన వెంకన్న 2023లో సూర్యాపేటలో ఒక ఆటోను దొంగతనం చేసిన కేసులో జైలుకు వెళ్లి ఆరునెలల శిక్ష అనుభవించాడు. కొంతకాలం బాగానే ఉన్నప్పటికీ మళ్లీ దొంగతనాలు చేస్తున్నాడు. ఈక్రమంలో ఆగస్టు 6న ఖమ్మంలో పంపింగ్‌వెల్ రోడ్డులో నిలిపి ఉంచిన ఆటో టీఎస్ 04 యూబీ0487ను దొంగిలించాడు. అదేరోజు సాయంత్రం ఖమ్మం స్నేహ డయాగ్నస్టిక్స్ సెంటర్ వెనుక భాగంలో ఆపి ఉన్న టీఎస్04యూఏ1871 నెంబర్ గల ఆటోను దొంగిలించి ఇంటికి వెళ్లాడు. నిందితుడు నుంచి రెండు ఆటోలను స్వాధీనం చేసుకుని ఖమ్మం 3టౌన్, వన్‌టౌన్‌లో కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. క్రైమ్ వర్టికల్ హెడ్ కానిస్టేబుల్ సంజీవ్, కానిస్టేబుల్ హరికృష్ణను అభినందించారు.

కొణిజర్ల పాఠశాలలో డీఈవో ఆకస్మిక తనిఖీ

కొణిజర్ల, ఆగస్టు 9: కొణిజర్ల ఉన్నత పాఠశాలను డీఈవో సోమశేఖరశర్మ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠాలను పరిశీలించారు. 7వ తరగతి సైన్స్ పాఠ్యాంశం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయనే స్వయంగా పాఠ్యాంశాన్ని విద్యార్థులకు బోధించారు. పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో ఎందుకు జాయిన్ కాలేదని ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక స్థాయిలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరై ఎన్ఏఎస్‌పై పలు సూచనలు చేశారు. ఎంఈవో శ్యాంసన్, నోడల్ ఆఫీసర్ అబ్రహం, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖమ్మంలో నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల హల్‌చల్

రఘునాథపాలెం, ఆగస్టు 9: ఖమ్మంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల పేరుతో శుక్రవారం కొందరు వ్యక్తులు హల్‌చల్ చేశారు. నగరంలోని ఓ హోటల్‌లోకి ప్రవేశించి హడావుడి చేశారు. చివరకు బెదిరించి డబ్బులు డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చిన హోటల్ యజమాని పోలీసులను ఆశ్రయించాడు. ఖానాపురం హవేలీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన గుగులోతు మోహన్, బానోతు రామస్వామి, సపావత్ యువరాజ్, అజ్మీరా యువరాజ్ శుక్రవారం మమత రోడ్డులోని కింగ్ దర్బార్ హోటల్‌కు వచ్చి ఫుడ్ ఇన్‌స్పెక్టర్లమంటూ తనిఖీలు నిర్వహించారు. హోటల్‌లో తినుబండారాలను పరిశీలించిన వారు యజమానిని బెదిరించే క్రమంలో డబ్బులు డిమాండ్ చేశారు. అనంతరం అక్కడి నుంచి వారు వెళ్లిపోవడంతో అనుమానం వచ్చిన హోటల్ యజమాని పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై నలుగురిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

ఖమ్మంలో మహేశ్‌బాబు జన్మదిన వేడుకలు

రక్తదానం చేస్తున్న మహేశ్‌బాబు అభిమానులు

ఖమ్మం, ఆగస్టు 9: సినీ నటుడు మహేశ్‌బాబు జన్మదిన వేడుకలను సూపర్‌స్టార్ మహేశ్ సేన ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దేవభక్తుని కిషోర్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రాలు, పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఖమ్మం నగరంలో సూపర్‌స్టార్ కృష్ణ ఖమ్మం జిల్లా, నగర కమిటీ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో సుమారు 200 మంది యువకులు రక్తదానం చేశారు. ఏసీపీ గణేష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ విచ్చేసి యువకులను అభినందించారు. దాసరి ఫౌండేషన్ అనాథాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు తోట రంగారావు మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. కిషోర్‌బాబు మాట్లాడుతూ మహేష్‌బాబు సుమారు 3,500 మంది పిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్ చేయించారని తెలిపారు.

రసవత్తరంగా నాటిక పోటీలు

ఖమ్మం, ఆగస్టు 9: 'నెలనెలా.. వెన్నెల' ఏడో వార్షికోత్సవం సందర్భంగా ఖమ్మంలో శుక్రవారం ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. కళా పరిషత్ గౌరవ అధ్యక్షుడు వీవీ అప్పారావు, అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిన రవి, నిర్వాహకులు సుబ్రహ్మణ్యకుమార్, జగన్మోహన్‌రావు, కళాకారులు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్‌బాబు బయ్యన, డాక్టర్ వేల్పుల విజేత, అన్నాబత్తుల రాణి, ప్రవీణ్, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ తదితరులు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు. వీవీ అప్పారావుకి స్తంభాద్రి అవార్డు ప్రదానం చేసి సన్మానించారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన M/S. హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ తరుపున వారి వరంగల్ Chief Regional Manager, Sri.Nafsad TN, S/o. Tharayil Naseem Age : 39 years గారి తరుపున ఈ ప్రకటన ఇవ్వనైనది. పండితాపురం, H/o. కొమ్మినేనిపల్లి గ్రామం, కామేపల్లి మండలం, ఖమ్మం జిల్లాలో 1465.1 చ||గజాలు లేదా 1225.00 చ||మీ||లు కొమ్మినేనిపల్లి రెవిన్యూ గ్రామ సర్వే నెం. 72/A & 72/A/1 (old Sy.No. 72/A, Nala Converted new Sy.No. 72/A/1) గల స్థలమును పెట్రోల్ మరియు పెట్రోల్ సంబంధించిన ఉత్పత్తులను రిటైల్‌గా అమ్ముటకు **ధరావత్ బాలు,** S/o. వశ్య గారితో లీజు ఒప్పందముకుదిరినది. ఇట్టి లీజు ఒప్పందమునకు ఎవరికైనా ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 30 రోజులలోపు ఈ క్రింది ఉదహరించిన అడ్రస్‌కు తెలియజేయగలరు. లేని యెడల ఏమి అభ్యంతరములు లేవని ఒప్పందము ఖరారు చేసుకొనగలరు. తదుపరి ఎటువంటి ఆక్షేపణలు చెల్లనేరవు.

పైన తెలిపిన స్థలమునకు హద్దులు :
తూర్పు : ఖమ్మం నుంచి ఇల్లందు పోవు R&B రోడ్డు, **పడమర :** లీజు ఇచ్చిన వారి ఖాళీ స్థలము, **ఉత్తరము :** లీజు ఇచ్చిన వారి ఖాళీ స్థలము, **దక్షిణము :** లీజు ఇచ్చిన వారి ఖాళీ స్థలము.

సం/- ఎ.వి.రామానుజ చార్యులు
న్యాయవాది, ఖమ్మం.
సెల్ : 9849400413

గ్రామాల్లో వైద్య శిబిరాలు

వేంసూరు, ఆగస్టు 9: మండలంలోని వేంసూరు, మర్లపాడు, రామన్నపాలెం, ఎస్సీకాలనీ, పల్లెవాడ, కందుకూరు గ్రామాల్లో శుక్రవారం మండల వైద్యాధికారి డాక్టర్ ఇందుప్రియాంక ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. 156 మందికి సాధారణ, చిరువ్యాధులకు చికిత్సలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు పల్లవలి, ఎంఎల్‌హెచ్‌పీలు మౌనిక, బాబు, సీహెచ్‌వో వెంకటనారాయణ, పర్యవేక్షకులు శ్రీనివాస్, ఆరోగ్య సహాయకులు షబ్నమ్, ప్రసాద్, నాగరాజు, హరీశ్, శ్రీలక్ష్మీ, జ్యోతి, రమాదేవి, కృష్ణవేణి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైనా సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

'పల్లెప్రకృతి'పై పట్టింపేది?

- రఘునాథపాలెం మండలంలో ఎండిపోయిన వనం
- గత కేసీఆర్ ప్రభుత్వంలో కళకళలాడిన ప్రకృతివనం

ఆనవాళ్లు లేకుండా ఎండిన చెట్లతో మిగిలిన పల్లె ప్రకృతివనం

రఘునాథపాలెం, ఆగస్టు 9: పల్లెల్లో పచ్చదనం ఫరిడవిల్లాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం 'పల్లెప్రకృతి' పేరుతో వనాలను ఏర్పాటు చేసింది. గ్రామాల పరిధిలోని ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవకుండా ఉండడంతో పాటు, గ్రామస్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలనేది ప్రధాన ఉద్దేశం. ఇందుకు ప్రతి గ్రామంలో పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. అందమైన పూలు, చక్కటి గాలిని అందించే మొక్కలను పెంచింది. పార్కులను తలపించేలా వనాలను ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు మురిసిపోయారు. సాయంత్రం వేళ వనాల్లోకి వెళ్లి హాయిగా స్వేద తీరారు. వనాల్లో ఏర్పాటుచేసిన బల్లాలపై కూర్చుని పెద్దలు కాలక్షేపం చేశారు. పిల్లలు ఆట వస్తువులతో ఆటలాడుకున్నారు. కానీ ఇప్పుడా పల్లెప్రకృతి వనాలు బోసిపోయాయి. కేసీఆర్ ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన పల్లెప్రకృతి వనాల ఉద్దేశం నీరుగారుతోంది. పల్లెప్రకృతి వనాల్లోని చెట్లన్నీ ఎండిపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం పల్లెప్రకృతి వనాల నిర్వహణను గాలికొదిలేసింది. పచ్చదనంపై బొత్తిగా పట్టింపు లేకుండాపోయింది. కేవలం పల్లెప్రకృతి వనమని తెలియజేసే బోర్డులు మాత్రమే దర్శనమిస్తున్నాయి. గతంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది సమష్టిగా పనిచేసి మొక్కలను కాపాడారు. ప్రస్తుతం రఘునాథపాలెం మండలంలోని అన్ని పల్లెప్రకృతి వనాలు ఎండిపోయి కనిపిస్తున్నాయి. మండల కేంద్రంలో రఘునాథపాలెం మోడల్ కాలనీలోని పల్లెప్రకృతి వనం పూర్తిగా ఆనవాళ్లు లేకుండా పోయింది. ఒకప్పుడు అందమైన పూలమొక్కలతో స్థానికులకు అహ్లాదాన్ని పంచిన పల్లెప్రకృతి వనంలోని చెట్లను ఇష్టానుసారంగా నరికివేశారు. దీంతో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనం ఉద్దేశం అధికారులు నిర్లక్ష్యంతో పనికిరాకుండా పోయింది. నర్సరీలోని బల్లాలు, రోడ్లు కనిపించకుండా పోయాయి. ప్రధాన గేటు ధ్వంసమైంది. బయటి శిలాఫలకం కానరాకుండా చేశారు.

నేడు 'విద్యుత్'కు అంతరాయం

మామిళ్లగూడెం/ కొణిజర్ల/ వేంసూరు/ వైరా టౌన్ (ఏన్కూరు), ఆగస్టు 9: కొణిజర్ల, చింతకాని మండలాల్లో 33 కేవీ కొణిజర్ల లైన్ మరమ్మతుల నిర్వహణ కారణంగా ఆయా మండలాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొణిజర్ల, పెద్దగోపతి, కొదుమూరు, చింతకాని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఖమ్మం, వేంసూరు, ఏన్కూరులో..

ఖమ్మం, వేంసూరులో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఏన్కూరులో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.

హార్వెస్ట్‌లో విద్యార్థి ఎన్నికలు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 9: నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల కోసం నాలుగు పోలింగ్ బూత్‌లు, 8 నమూనా ఈవీఎంలను ఏర్పాటు చేసి శాసనసభ, లోక్‌సభ మాదిరిగా ఎన్నికలు జరిపారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి ఈ ఎన్నికలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తెలిపారు. ఎస్‌పీఎల్‌గా సుభాష్‌చంద్ర ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిని విద్యాసంస్థల అధినేత పోపూరి రవిమారుత్ అభినందించారు.

ముివ్వా శ్రీనివాస్‌కు మాతృవియోగం

పద్మావతి (ఫైల్)

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 9: ప్రైవేట్ విద్యాసంస్థల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కన్వీనర్ ముివ్వా శ్రీనివాస్ మాతృమూర్తి పద్మావతి (84) శుక్రవారం మృతిచెందారు. గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మృతురాలి స్వగ్రామం లంకపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. పద్మావతి మృతదేహానికి పలు పార్టీల నాయకులు, విద్యాసంస్థల యాజమానులు నివాళి అర్పించారు.

జాబ్‌మేళాలో 15 మంది ఎంపిక

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 9: నగరంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం హెచ్‌సీఎల్ సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు 30మంది పాల్గొనగా 15మంది ఎంపికైనట్లు డీఐఈవో రవిబాబు తెలిపారు. విద్యార్థులకు డిగ్రీతోపాటు రెండేళ్ల శిక్షణ ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ రామారావు, గోవిందరావు, అంకిత, రమేష్ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 9: నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ట్రైనర్ సమీర్ కుమార్ మాట్లాడుతూ లక్ష్యాలకు అనుగుణంగా శ్రమించాలని సూచించారు. ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

చింతకాని, ఆగస్టు 9: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన చింతకాని మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని నామవరం గ్రామానికి చెందిన బొలికొండ భాను అనే వ్యక్తి ఈ నెల 2న విద్యుత్ స్తంభంపై విద్యుదాఘాతానికి గురైన అక్కడి నుంచి కింద పడిన విషయం విదితమే. తీవ్రంగా గాయపడిన అతడు అప్పటి నుంచి హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

కూసుమంచి సీఐగా సంజీవ్

జే.సంజీవ్

కూసుమంచి/ తిరుమలాయపాలెం, ఆగస్టు 9: కూసుమంచి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జే.సంజీవ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ కూసుమంచిలో పనిచేస్తున్న జనార్దన్ బదిలీ కావడంతో తొర్రూర్ నుంచి బదిలీపై వచ్చిన సంజీవ్ ఇక్కడ చార్జ్ తీసుకున్నారు.

ఎస్ఐగా నాగరాజు..

కూసుమంచి ఎస్ఐగా నాగరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కిరణ్‌కుమార్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో నాగరాజు బదిలీపై వచ్చి చార్జ్ తీసుకున్నారు.

తిరుమలాయపాలెం ఎస్ఐగా జగదీశ్

తిరుమలాయపాలెం ఎస్ఐగా కూచిపూడి జగదీశ్ శుక్రవారం విధుల్లో చేరారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన గిరిధర్‌రెడ్డి.. మహబూబాబాద్ జిల్లా పెద్దగూడూరుకు బదిలీపై వెళ్లిన విషయం విదితమే. అదే జిల్లా తొర్రూరులో పనిచేస్తున్న జగదీశ్ బదిలీపై తిరుమలాయపాలెం వచ్చారు.

15న వైరాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

రుణమాఫీ సంపూర్ణంగా అమలుచేస్తాం: డిప్యూటీ సీఎం భట్టి

వినతిపత్రాలు పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వైరా టౌన్, ఆగస్టు 9: ఈ నెల 15న వైరాలో నిర్వహించే రైతు రుణమాఫీ భారీ బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఆగస్టు 15 నాటికి రైతులకు రుణమాఫీ సంపూర్ణంగా అమలు చేస్తామన్న మాటను నిలబెట్టుకొని ఖమ్మం వేదికగా సభను నిర్వహిస్తున్నామని అన్నారు. వైరాలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండు విడతలుగా రుణమాఫీ చేశామన్నారు. ముందుగా వైరాలో ఆయనకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు స్వాగతం పలికారు. అనంతరం మున్సిపాలిటీలో అమృత్ 2.0 పథకంలో భాగంగా మంజూరైన రూ.26.87 కోట్లతో చేపట్టనున్న మంచినీటి సరఫరా పథకానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి శిథిలమైన భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను డిప్యూటీ సీఎంకు ప్రిన్సిపాల్ వివరించారు. నూతన తరగతి గదులు, ల్యాబ్స్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాలని డీఐఈవో రవిబాబును ఆదేశించారు. హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యం, మున్సిపల్ చైర్మన్ జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు అండగా తెలంగాణ ప్రభుత్వం: పొంగులేటి

చర్చి ప్రారంభంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్, ఆగస్టు 9: క్రైస్తవులందరికీ తెలంగాణ ప్రభుత్వం అండగా ఉందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని టీఎన్‌జీవోస్ కాలనీలో నూతనంగా నిర్మించిన చర్చిని టీఎన్‌జీవోస్ హౌజ్ బిల్డింగ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అన్నారు. నాయకులు మద్ది శ్రీనివాసరెడ్డి, బండి జగదీశ్, చర్చి బాధ్యులు, టీఎన్‌జీవోస్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటన: తుమ్మల

ఖమ్మం, ఆగస్టు 9: రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ నెల 11వ తేదీన పర్యటన చేయనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్-2 ట్రయల్ రన్ చేయనున్నట్లు తెలిపారు. కమలాపురం వద్ద పంప్‌హౌస్ 3 కూడా ట్రయల్ రన్ చేస్తారని పేర్కొన్నారు.

వైద్య కళాశాలకు భూ కేటాయింపు ఉత్తర్వులు

ఖమ్మం, ఆగస్టు 9: ఖమ్మంలో నిర్మించనున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 35.6 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం అర్బన్ మండలం బల్లేపల్లిలోని సర్వే నెంబర్ 137లో 17 ఎకరాల 26 కుంటలు, రఘునాథపాలెంలో సర్వేనెంబర్ 218లో 17ఎకరాల 20 కుంటల భూమిని కేటాయించారు. అదేవిధంగా రఘునాథపాలెంలో శ్రీ స్వామి నారాయణ్ గురుకుల ఇంటర్నేషనల్ స్కూల్‌కు వివిధ సర్వే నెంబర్లలో 13 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

విద్యుత్‌శాఖ స్పోర్ట్స్ కౌన్సిల్ ఏకగ్రీవ ఎన్నిక

మామిళ్లగూడెం,ఆగస్టు 9: తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఉమ్మడి ఖమ్మంజిల్లా విద్యుత్‌శాఖ స్పోర్ట్స్ కౌన్సిల్‌ను ఖమ్మం సర్కిల్ ఎస్ఈ సురేందర్ అధ్యక్షతన ఏగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖమ్మం సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో కౌన్సిల్ చైర్మన్‌గా ఎస్ఈ సురేందర్, కన్వీనర్‌గా వీ. సీహెచ్ బాబురావు, కోశాధికారిగా సీతారాం గోపాల్, సభ్యులుగా జయప్రకాష్, ఆర్ఎస్ రాజు, బి.రామకృష్ణతోపాటు వివిధ క్రీడలకు ఇన్‌చార్జిలను నియమించారు. క్రికెట్ ఇన్‌చార్జిగా వివేక్, నాగేంద్ర, షటిల్‌కు ఎన్.షణ్ముఖాచారి, వాలీబాల్‌కు ఉపేందర్, కబడ్డీకి వెంకటేశ్వరరావు, బాస్కెట్‌బాల్‌కు ఇమామ్, ఉమెన్స్ గేమ్స్‌కు లావణ్య, క్యారమ్స్‌కు యాసిన్, బాల్ బ్యాడ్మింటన్‌కు రమేష్, కల్చరల్ కార్యదర్శిగా ఎం. ప్రసాద్, టేబుల్ టెన్నిస్‌కు లిఖిత, అథ్లెటిక్స్‌కు శేఖర్‌బాబును ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ టెక్నికల్ బాబూరావు, ఖమ్మం డివిజన్ డీఈఈ రామారావు, విజిలెన్స్ డీఈఈ వెంకటేశ్వర్లు, ఎస్ఏవో శ్రీధర్, ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏకలవ్యుడే మార్గదర్శకుడు: కమాండెంట్ ఛటర్జీ

కేక్ కట్ చేస్తున్న కమాండెంట్ ఛటర్జీ

సత్తుపల్లి, ఆగస్టు 9: ఆదివాసీలకే కాదు.. అన్ని వర్గాలకు ఏకలవ్యుడు మార్గదర్శకుడని, అలాంటి మహనీయుడిని ఆదివాసీ దినోత్సవం రోజు స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని జంగారం 15వ బెటాలియన్ కామాండెంట్ పీజేపీసీ ఛటర్జీ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జంగారం 15వ బెటాలియన్‌లో శుక్రవారం ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత కొమరంభీం చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఆదివాసీల ఐక్యతకు, వారి నిజాయితీకి ఏకలవ్యుడు నిదర్శనమని గుర్తు చేశారు. అనంతరం గ్రామంలో ఆదివాసీలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ముందు భాగాన ఆదివాసీ మహిళలు చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో బెటాలియన్ సహాయ దళాధిపతి ఎస్‌డీ.రంగారెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే మధిర అభివృద్ధి: కమల్‌రాజు

లింగాల కమల్‌రాజును సన్మానిస్తున్న నాయకులు

మధిర, ఆగస్టు 9: గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే మధిర మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దామని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ పట్టణ, మండల పార్టీ ఆధ్వర్యంలో లింగాల కమల్‌రాజును, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో పని చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. తన పదవీ కాలంలో కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించానని గుర్తు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అప్పారావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, చావా వేణు, కోన నరేందర్‌రెడ్డి, నారాయణరావు, కపిలవాయి జగన్మోహన్, జేవీ.రెడ్డి, కోటిరెడ్డి, బోగ్యం ఇందిర, పరిస శ్రీను, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా సాంబరాజు


సాంబరాజు

మామిళ్లగూడెం, ఆగస్టు 9: పోలీస్ కమిషనరేట్ పరిధిలో కీలకంగా ఉన్న స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) ఏసీపీగా యూ.సాంబరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్‌బీ ఏసీపీగా బాధ్యతలు నిర్వహించిన ప్రసన్నకుమార్ బదిలీకావడంతో ఖమ్మం కమిషనరేట్‌లో సీసీఆర్‌బీ ఏసీబీగా విధులు నిర్వహిస్తున్న సాంబరాజు నియమితులయ్యారు.

ఖమ్మంలో హెరాయిన్ కలకలం

- 2.5 గ్రాముల సరుకు స్వాధీనం
- నిందితుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

మామిళ్లగూడెం, ఆగస్టు 9: ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నుంచి 2.5 గ్రాముల హెరాయిన్‌ను ఖమ్మం టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఖమ్మం రోటరీనగర్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. కొద్ది రోజులుగా అతడు డ్రగ్స్‌కు బానిసయ్యాడు. ఇటీవల ఖమ్మం వచ్చిన అతడు అసోం నుంచి 2.5 గ్రాముల హెరాయిన్‌ను పోస్ట్ ద్వారా తన ఇంటికి తెప్పించుకున్నాడు. కొద్ది రోజులుగా నిందితుడిపై నిఘా పెట్టిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పోస్ట్‌మెన్‌ను వెంబడించి నిందితుడు పార్శిల్ తీసుకున్న వెంటనే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారించగా.. ఇప్పటికే 10 నుంచి 15 సార్లు హెరాయిన్‌ను వివిధ మార్గాల్లో తెప్పించుకున్నట్లు ఒప్పుకున్నాడు.

డయల్ 100ను సద్వినియోగం చేసుకోవాలి: సీపీ

మామిళ్లగూడెం, ఆగస్టు 9: ప్రజా సంరక్షణే ధ్యేయంగా ఏర్పాటు చేసిన డయల్ 100ను ఆపద సమయంలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం సీపీ సునీల్‌దత్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. గత జూలై నెలలో డయల్ వందకు 2,531 కాల్స్ వచ్చాయని పేర్కొన్నారు. వాటిలో 78 సంఘటనల విషయంలో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని తెలిపారు. కొంత మంది వ్యక్తులు తప్పుడు కాల్స్ చేస్తున్నారని ఇలా చేయరాదని హెచ్చరించారు.

బాలికను వివాహం చేసుకున్న వ్యక్తిపై కేసు

మధిర, ఆగస్టు 9: బాలికను వివాహం చేసుకున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మధిర పట్టణ ఎస్సై సంధ్య శుక్రవారం తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.జ్యోతికుమారి ఇచ్చిన ఫిర్యాదు వివరాలను ఆమె వెల్లడించారు. మధిర మండలానికి చెందిన ఓ బాలికను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొర్రపాటి తిరుమలయ్య అనే వ్యక్తి ఏపీ నందిగామ మండలం పల్లగిరిగుట్టలో చర్చిలో జూన్ 20న వివాహం చేసుకున్నాడు. ఇటీవల ఈ విషయాన్ని ఐసీడీఎస్ అధికారులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బాలికను వివాహం చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సూర్యప్రకాశ్‌రావు కుటుంబానికి సండ్ర పరామర్శ

చింతకాని, ఆగస్టు 9: మండలంలో జగన్నాథపురానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కోలేటి సూర్యప్రకాశ్‌రావు కుటుంబాన్ని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న సూర్యప్రకాశ్‌రావు ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సండ్ర వెంకటవీరయ్య.. శుక్రవారం సూర్యప్రకాశ్‌రావు నివాసానికి చేరుకొని అతడి చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రజాప్రతినిధిగా అతడు అందించిన సేవలను గుర్తుచేశారు. బీఆర్ఎస్ నాయకుడు కోలేటి రాధాకృష్ణ పాల్గొన్నారు.

రవీంద్ర కుటుంబానికి కమల్‌రాజు ఓదార్పు

మధిర, ఆగస్టు 9: మధిర బంజారాకాలనీకి చెందిన అద్దంకి రవీంద్ర ప్రమాదవశాత్తూ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు శుక్రవారం వారి నివాసానికి వెళ్లి అతడి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం అతడి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలియజేశారు. కౌన్సిలర్ అప్పారావు, ముత్తవరపు ప్యారీ, నాగలవంచ రామారావు, కోల కొండ, చీరాల రాంబాబు, ఆవుల గోపి తదితరులు పాల్గొన్నారు.

'మారుమూల ప్రాంతాలకూ తపాలా సేవలు'

కూసుమంచి (నేలకొండపల్లి), ఆగస్టు 9: భారతీయ తపాలా శాఖ మారుమూల ప్రాంతాలకూ అనేక రకాల సేవలు అందిస్తోందని ఎండీఎస్ పెరుగు నాగేశ్వరరావు, ఐపీవో గోపీనాథ్ అన్నారు. బ్యాంకులతో పోటీ పడుతూ ప్రతి గ్రామంలోనూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తోందని వివరించారు. నేలకొండపల్లి మండలంలో శుక్రవారం పర్యటించిన వారు.. కోరట్లగూడెం గ్రామస్తులకు తపాల శాఖ సేవలపై అవగాహన కల్పించారు.

'పాఠశాల పనులను త్వరగా పూర్తి చేయండి'

కూసుమంచి, ఆగస్టు 9: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. భగత్‌వీడు, మంగలితండా పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్యాబోధనను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి ఇంతిరాజ్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

'జాగ్రత్త చర్యలతో నష్ట తీవ్రతను తగ్గించొచ్చు'

కూసుమంచి, ఆగస్టు 9: అగ్ని ప్రమాదాలు అకస్మాత్తుగా జరుగుతుంటాయి కాబట్టి జాగ్రత్త చర్యలు చేపడితే వాటి వల్ల కలిగే నష్ట తీవ్రతను తగ్గించవచ్చునని కూసుమంచి ఫైర్ ఎస్సై మోహన్‌రావు అన్నారు. అగ్ని ప్రమాదాల నివారణపై కూసుమంచి జేవీఆర్ ఇంటర్, డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆదివాసీలు హక్కులను కాపాడుకోవాలి'

మధిర రూరల్/ పెనుబల్లి/ వేంసూరు/ కారేపల్లి, ఆగస్టు 9: ఆదివాసీలు తమ హక్కులను కాపాడుకోవాలని హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్, మధిర మండల లీగల్ సర్వీస్ అథారిటీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట వెంకట్ సూచించారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మధిర మండలంలోని వెంకటాపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అలాగే, పెనుబల్లి, వేంసూరు, కారేపల్లి మండలాల్లోనూ వివిధ పార్టీలు, ఆదివాసీ సంఘాల నాయకులు ఆదివాసీ దినోత్సవాలను నిర్వహించారు. అమరవీరుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మతిస్థిమితం లేని మహిళ బంధువుల చెంతకు..

మధిర, ఆగస్టు 9: మతిస్థిమితం లేని ఓ మహిళను మధిర రైల్వే పోలీసులు శుక్రవారం ఆమె బంధువులకు అప్పగించారు. ఈ ప్రాంతంలో రైలు కింద పడబోయిన ఈ మహిళను కొన్ని రోజుల క్రితం ఇక్కడి రైల్వే పోలీసులు కాపాడిన విషయం విదితమే. అప్పుడే ఆమెను స్థానిక ఆర్‌కే ఫౌండేషన్ ఆశ్రమానికి తరలించారు. మీడియా ద్వారా సమాచారం తెలుసుకున్న ఏపీలోని గురజాల గ్రామస్తులు.. ఆమె కుటుంబ సభ్యులకు ఈ విషయం చెప్పారు. మధిర రైల్వే పోలీసుల సహకారంతో ఆర్‌కే ఫౌండేషన్ ఆశ్రమానికి చేరుకున్న ఆమె కుటుంబ సభ్యులు అక్కడ ఆశ్రయం పొందుతున్న ఆ మహిళను గుర్తించారు. ఆమె పేరు వడిత్య మల్లేశ్వరి అని, ఆమె తన భార్యేనని ఆమె భర్త చెప్పాడు. భర్త, ఇతర కుటుంబ సభ్యుల సమక్షంలో ఆమెను వారికి అప్పగించారు.

రోడ్లు బురదమయం.. నాట్లు వేసి నిరసన..

నాట్లు వేసి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

రఘునాథపాలెం, ఆగస్టు 9: మండల కేంద్రం రఘునాథపాలెం పంచాయతీ పరిధి గ్రీన్‌కాలనీలో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. దీంతో కాలనీవాసులు శుక్రవారం ఆ బురద రోడ్డులో నాట్లు వేసి నిరసన వ్యక్తంచేశారు. రోడ్డును వెంటనే బాగు చేయాలని డిమాండ్ చేశారు. గ్రీన్‌కాలనీపై అధికారులు కనీసం కన్నెత్తి చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీవాసులు, డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

మిరపనారుపై కలుపుమందు పిచికారీ


ఎండిపోయిన మిరప నారు

రఘునాథపాలెం, ఆగస్టు 9: మండలంలోని బూడిదంపాడులో ఓ రైతుకు చెందిన మిరపనారుపై గుర్తు తెలియని వ్యక్తులు కలుపుమందు కొట్టడంతో నారు ఎండిపోయిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కేళోతు చంద్రం నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకొని మిరపనారు పోసుకున్నాడు. నారు చేతికందిన సమయంలో దుండగులు కలుపుమందు కొట్టడంతో ఆ కుటుంబం బోరున విలపించారు. దీనిపై శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు.